రోడ్డుపైనే తప్పని నిరీక్షణ

- షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- వినతులు పట్టించుకోని అధికారులు
- ఎండైనా వానైనా తప్పని ప్రయాణం



మల్దకల్‌లో బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు(ఫైల్)

మల్దకల్: ప్రయాణికులే తమ సంస్థకు దేవుళ్లని చెప్పుకునే ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎండకు, వానకు కూడళ్ల వద్ద షెల్టర్లు, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వేలాది మంది ప్రయాణం..

మండల పరిధిలోని గద్వాల– అయిజ ప్రధాన రహదారిలో పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, మల్దకల్, తాటికుంట స్టేజీ వద్ద ప్రతి నిత్యం వందల సంఖ్యలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ధరూరు మండలంలోని వివిధ స్టేజీల వద్ద, గట్టు , కేటీదొడ్డి, గద్వాల మండలాల్లోని వివిధ స్టేజీల వద్ద బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించే విషయంలో లేదని ప్రజలు మండిపడుతున్నారు.

ప్రముఖ క్షేత్రాలకు వెళ్లాలన్నా ఇబ్బందులే..

మండల కేంద్రమైన మల్దకల్‌లో 12వేలకు పైగా జనాభా ఉండటంతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లాలోనే ప్రముఖ క్షేత్రంగా ఉన్న మల్దకల్ తిమ్మప్పస్వామి, అదే విధంగా వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం చేపట్టి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు..



బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక రోడ్డుపై ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. బస్సు షెల్టరు లేకపోవడంతో ఎండలో నిల్చొని ఉండాల్సిన పరిస్థితి ఉంది. బస్సు వచ్చే వరకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు బస్సు షెల్టరు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

-రంగన్న, అమరవాయి

షెల్టర్ నిర్మాణం చేపట్టాలి..



మండల కేంద్రంతో పాటు ప్రముఖ క్షేత్రంగా ఉన్న ఆదిశిలా క్షేత్రమైన మల్దకల్‌లో షెల్టర్ నిర్మాణం చేపట్టాలి. ప్రతి శనివారం వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకునేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

-రామాంజనేయులు, మల్దకల్

చర్యలు తీసుకుంటాం..



నియోజకరవర్గంలోని ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టరుల నిర్మాణం కోసం ప్రయాణికులు వినతి మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. అధికారుల సూచన మేరకు ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

-సునీత, గద్వాల డిపో మేనేజర్

క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

అలంపూర్: మున్సిపాలిటీలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే విజయుడు మున్సిపాలిటీలోని ఇమాంపురం పర్యటన నేపథ్యంలో బుధవారం ఏడాది క్రితం నిర్మించిన సాముహిక మరుగుదొడ్ల గురించి వివరించారు. దీంతో ఎమ్మెల్యే నిర్మించి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. ఇప్పటి వరకు బిల్లులు రాలేదని వారు తెలిపారు. పెండింగ్ బిల్లులు ఇప్పించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని శేఖర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

5న అంతర్రాష్ట్ర భజన పోటీలు

ఎర్రవల్లి: మండల పరిధిలోని దువాసిపల్లి గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 5న అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహించనున్నట్లు రామాంజనేయ భజన బృందం సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన సభ్యులు ముందుగా రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేయించాలన్నారు. వివరాలకు 98857 01976, 9052 671314ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పెంచికలపాడు శివారులో చేపడుతున్న పనులను బుధవారం ఎంపీడీఓ చెన్నయ్య పరిశీలించారు. కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. జాబ్‌కార్డులు ఉన్న వారు మాత్రమే ఉపాధి పనుల్లో పాల్గొనాలన్నారు. చేసిన పనులకు క్రమం తప్పక కూలి చెల్లిస్తారన్నారు. చేసిన పనులకు ఎప్పటికప్పుడు రికార్డు చేయించాలని మేట్లకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న తాగునీటి సమస్య



కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంట గ్రామంలో గత మూడు రోజుల నుంచి తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ సొంత ఖర్చులతో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి

అలంపూర్: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం సక్రమంగా జరగాలని తహసీల్దార్ మంజుల అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి రేషన్ దుకాణంలో అర్హులందరికీ రేషన్ బియ్యం అందించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



గట్టు: మండల పరిధిలోని మాచర్లలో మన గ్రోమోర్ సెంటర్, బల్గెరలోని ఆగ్రో రైతుసేవా కేంద్రం, మిట్టదొడ్డి స్టేజీలో విఘ్నేశ్వర, మిట్టదొడ్డి గ్రామంలోని పార్వతీ పరమేశ్వర దుకాణాలను వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ–పాస్ మిషన్‌లో రైతుల ఆధార్‌ను నమోదు చేసిన తర్వాతే ఎరువులు విక్రయించాలన్నారు. స్టాక్ వివరాలు రికార్డులో నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి



గద్వాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



అలంపూర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అలంపూర్/ధరూరు/గద్వాలటౌన్/శాంతినగర్: రాష్ట్ర రాజధానిలోని హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు జీ.రాజు, జీకే ఈదన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యూనివర్సిటీ భూములు రక్షించాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని అడ్డుకున్న విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యం చేసి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు నవీన్ తోపాటు మరికొంత మంది విద్యార్థులకు గాయాలైనట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ భూముల అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహ్మ, బంగారు రఫీ తదితరులు ఉన్నారు.

❑ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ధరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మండల నాయకులు దేవదాసు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేకల నర్సింహులు, ప్రవీణ్, మోష, గోవిందు, వినయ్, తిమ్మప్ప, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

❑ హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గద్వాల పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉప్పేర్ నర్సింహ, రంగన్న, నరేష్, కళ్యాణ్, రామకృష్ణ, వీరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

❑ వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ అంబేడ్కర్ చౌరస్తాలో హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు పరంజ్యోతి, దేవదాసు, వేణు, శేఖర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్థల పరిశీలన



ధరూరు: మండల కేంద్రంలో నూతన పోలీసు స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఎస్పీ టి. శ్రీనివాసరావు పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా పారుచర్ల స్టేజీ, జాంపల్లి గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. త్వరలోనే స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అనిల్ శాస్త్రీ, ఎస్ఐ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సమర్పించండి

గద్వాలన్యూటౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తులు మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ దశరథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుఫారం ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు), పట్టాదారు పాసుపుస్తకం (వ్యవసాయ రంగ పథకాలకు) సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులు) జిరాక్స్ పత్రాలతో పాటు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో జతపర్చాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

కేటీదొడ్డి: బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు అన్నారు. బుధవారం మండలంలోని గంగన్‌పల్లిలో మాజీ ఎంపీపీ మనోరమ, నాయకులు చక్రధర్, కార్యకర్తలను మాజీ జెడ్పీటీసీ బాసుశ్యామలతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌నాయుడు, మోనేష్, శేఖర్‌నాయుడు, రాము, రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు చాగాపురానికి ఎమ్మెల్యే రాక

ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురం గ్రామానికి గురువారం స్థానిక ఎమ్మెల్యే విజయుడు రానున్నట్లు తహసీల్దార్ భద్రప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండలంలోని గోపల్‌దిన్నే, పెద్దదిన్నే, నక్కలపల్లి, మునుగాల, ఉదందాపురం. శివనంపల్లి గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఉపశమనంగా చలివేంద్రాల ఏర్పాటు



రాజోళిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ పచ్చర్లకుమార్

రాజోళి: మండల కేంద్రంలో బుధవారం చలివేంద్రాన్ని అలంపూర్ మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ పచ్చర్ల కుమార్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండుతున్న ఎండల్లో వాహనదారులకు చలివేంద్రం ఉపశమనంగా ఉంటుందన్నారు. వాహనదారులకు దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రం ఏర్పాటు హర్షణీయమన్నారు. ఆయా గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు యువత, యువజన సంఘాలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగి రెడ్డి, ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, కార్యదర్శి క్రిష్ణయ్య, సుధీర్ తదిదరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. రెవెన్యూ కార్యాలయ సమీపంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఈ కృష్ణచైతన్య, మంజూరు, కార్యదర్శి మునినాయక్, యువకులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టాలి

ఎర్రవల్లి: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్ సయ్యద్‌ఖాన్ అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండల కేంద్రంతో పాటు బీచుపల్లి గ్రామంలో ఆయా జీపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు జీపీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రంగన్న, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ఫొటో లేదని నాయకుల వాగ్వాదం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రధాని మోదీ ఫొటో ఎందుకు లేదని అధికారులతో బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే విజయుడు ఎదుట ఫ్లెక్సీ చించేశారు. తహసీల్దార్ ప్రభాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులకు బీఆర్ఎస్ నాయకులు మధ్య వాగ్వాదం జరుగుతుండటంతో డీలర్లకు తెలియక చేశారని తెలుపడంతో గొడవ సద్దుమనిగింది. కార్యక్రమంలో పిగుడు వెంకటేష్, నాగేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అలంపూర్‌లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందించడానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపురం గ్రామంలో బుధవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాయకులు వెంకట్రామయ్య శెట్టి, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో ఎమ్మెల్యే విజేయుడు ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఆర్ఐ గురురాజ్, సీనియర్ అసిస్టెంట్ బాబు, డీలర్లు గజేంద్ర రెడ్డి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండంలోని తక్కశీలలో ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. పేద ప్రజలకే సన్న బియ్యం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవిప్రకాష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ కుమార్, చాంద్‌బాషా, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి



గద్వాలలో పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: తొలి తెలుగు జాతీయ విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం స్థానిక కృష్ణవేణి చౌరస్తా సమీపంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో కలిసి నివాళులర్పించారు. ఆయన వర్ధంతి చేసిన సేవలు కొనియాడారు. అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన మహాయోధుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్, ఇసాక్, మధుసూదన్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, జనార్ధన్‌గౌడ్, రామన్‌గౌడ్, కబీర్‌దాసు నర్సింహ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే పథకం

సన్నబియ్యం పథకం చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఉత్సాహంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలు రేషన్ దుకాణాల్లోని కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు

ధరూరు: ఏప్రిల్ 5న నారాయణపేటలో జరుగనున్న ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ గద్వాల జిల్లా అధ్యక్షుడు చంద్రాములు, మండల అధ్యక్షుడు శంకరన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి వందలాదిగా కార్మికులు కదిలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు మహేశ్వరమ్మ, సవారన్న, లక్ష్మి, బతుకన్న, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

నమూనా నిర్మాణ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇటిక్యాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఇందిరమ్మ ఇంటి నమూనా స్థలాన్ని హౌసింగ్ పీడీ కాశీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు నాలుగు విడుతల్లో చెల్లిస్తుందన్నారు. బేస్‌మెంట్ పూర్తిచేసిన లబ్దిదారులకు మొదటి విడత కింద రూ.లక్ష మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నమూన పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేసేలా చూడాలని ఎంపీడీఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, కార్యదర్శి రమేష్, ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



మానవపాడులో పరీక్ష కేంద్రం వద్ద విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షతో ముగియడంతో విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య తమ ఊర్లకు పయనమయ్యారు. విద్యార్థులు విజయకేతనం చూపిస్తూ పరీక్ష కేంద్రాల వద్ద ఆనందం వ్యక్తం చేశారు.

❑ మానవపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 296 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

❑ ఉండవెల్లి మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 407 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల ఇన్‌చార్జ్ అశోక్ తెలిపారు.



ఉండవెల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

❑ ఇటిక్యాల మండల కేంద్రంలో 190 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

❑ ఎర్రవల్లి మండలంలో 408 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ అమీర్‌పాషా తెలిపారు.

❑ అలంపూర్ పట్టణంలోని రెండు కేంద్రాల్లో 305 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు.

❑ అయిజ మండల కేంద్రంలో ఐదు, మండలంలోని ఉత్తనూరులో ఒక పరీక్ష కేంద్రంలో 991 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

❑ మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో 496 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు భాస్కర్‌పాపన్న, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇటిక్యాల: మండల పరిధిలోని వావిలాల, సాతర్ల గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కేవీ నుంచి సాతర్ల గ్రామ పరిధిలోని 33 కేవీ కొత్తఫీడర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని సూచించారు.